నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | KHAMMAM


ఎర్రబోరు గ్రామంలో వృథాగా ఉన్న భగీరథ వాటర్ ట్యాంకు


నీరు రాని నల్లాలు

# తాగునీటి సమస్యను.. మళ్లీ తెచ్చారు

- 'భగీరథ'ను పక్కకు పెట్టడంతో మొదలైన తాగునీటి సమస్య
- 'భద్రాద్రి'లోని మారుమూల గ్రామాల్లో ఇప్పటికే కటకట
- ఎండలు మరికొంత పెరిగితే పల్లెవాసుల గొంతెండే ప్రమాదం
- నల్లాలు, పైపులు సిద్ధంగా ఉన్నా మొట్టిన రేవంత్ సర్కారు
- అవి మట్టిలో కలిసిపోతున్నా అంతులేని నిర్లక్ష్యం
- 21 గ్రామాల్లో నీటి సమస్యను నిర్ధారిస్తున్న గణాంకాలు
- మరి సమస్య ఉన్నా అధికారిక లెక్కల్లోకి రాని పల్లెలెన్నో?
- తాగునీటి సమస్యపై సాక్షాత్తూ కలెక్టర్ నుంచే ప్రకటన
- మంచినీళ్లు రాకుంటే ఫోన్ చేయాలంటూ నంబర్ల విడుదల
- రాష్ట్రస్థాయిలోనూ టోల్‌ఫ్రీ నంబర్ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం


భగీరథ నీరు లేని దుమ్ముగూడెం మండలం ఎర్రబోరు గ్రామం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : గత ముఖ్యమంత్రి కేసీఆర్ పొడగిట్టని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆయన తెచ్చిన పథకాలన్నింటినీ నీరుగార్చుతూ వస్తున్నది. తాజాగా మిషన్ భగీరథపైనా రేవంత్ సర్కారు కన్ను పడింది. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకాన్ని పక్కకు పెట్టినట్లు స్పష్టమవుతున్నది. నల్లాలు, పైపులు సిద్ధంగా ఉన్న చోట కూడా వాటికి కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇంటి ముంగిట నల్లా ఉన్న పేదలు.. శుద్ధజలాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఓ వైపు పేదల గొంతెండుతున్నా, మరోవైపు భగీరథ పరికరాలు మట్టిలో కలిసిపోతున్నా స్పందించకుండా అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. పైగా, భద్రాద్రి జిల్లాలోని 21 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అయితే, అధికారుల లెక్కల్లోకి రాని గ్రామాలు ఇంకా అనేకం ఉన్నాయి.

అయితే, మిషన్ భగీరథ పేరును ప్రస్తావించినా, ఆ శుద్ధజలాలను చూసినా, దప్పిక తీరేలా తాగినా గత ముఖ్యమంత్రి కేసీఆరే ప్రజలకు గుర్తుకొస్తారని భావించిన ప్రభుత్వం.. క్రమంగా ఈ పథక ఆనవాళ్లు లేకుండా చేసేలా ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. అందుకే ఇప్పటికే సిద్ధంగా ఉన్న పైపులకు కూడా కనెక్షన్లు ఇవ్వడం లేదు. జిల్లాలో తాగునీటి సమస్య ఉన్నా, మారుమూల గ్రామాల్లో ప్రజల గొంతు ఎండుతున్నా కనీసం స్పందించడం లేదు. అయితే, తాగునీటి సమస్యపై సాక్షాత్తూ కలెక్టర్ కూడా ఇటీవల కీలక ప్రకటన చేశారు. తాగునీటి సమస్య ఉంటే నేరుగా ఫోన్ చేయాలంటూ ఓ ఫోన్ నంబరును విడుదల చేశారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ఏకంగా కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశారు. అయితే, రాష్ట్రస్థాయిలోనూ ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేయడం గమనార్హం.

### మచ్చుకు ఓ మారుమూల గ్రామాన్ని పరిశీలిస్తే..

అది మారుమూల గ్రామం ఎర్రబోరు. దుమ్ముగూడెం మండలం పెదకమలాపురం గ్రామ పంచాయతీలోనిది ఈ చిన్న పల్లె. అక్కడ 400 మంది జీవిస్తున్నారు. అందరూ కూలీలే. వారికి ఇప్పటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదు. చేతిపంపులే వారికి దిక్కుగా ఉన్నాయి. గత ప్రభుత్వం వేసిన మిషన్ భగీరథ నల్లాలకు కనీసం కనెక్షన్లు కూడా ఇవ్వడం లేదు. ఆ నల్లాలు మట్టిలో కలిసిపోతున్నా కూడా కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికే వేసవి సమీపించింది. ఎండలు మరికొంత ముదిరితే గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడిపోతారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కనీస మాత్రంగా కూడా కనికరం చూపడం లేదు. అయితే, ఇలాంటి గ్రామాలు జిల్లాలో ఇంకా అనేకం ఉండడం గమనార్హం. కాగా.. పెదకమలాపురం గ్రామంలో భగీరథ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అన్ని కుటుంబాలకు సరిపోవడం లేదు. కొద్దిమొత్తంగా సరఫరా చేసి నిలిపివేస్తున్నారు. ఇక ఇదే మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద అసలు భగీరథ నీటినే సరఫరా చేయడం లేదు.

### వేసవి రాకముందే తాగునీటి కష్టాలు..

వేసవి రాకముందే భద్రాద్రి జిల్లాను తాగునీటి సమస్య వెంటాడుతోంది. కేవలం మిషన్ భగీరథ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుండడం వల్లే సమస్య జఠిలమవుతున్నది. భద్రాద్రి జిల్లాలో ఉన్న 481 గ్రామ పంచాయతీలకుగాను కేవలం 21 గ్రామ పంచాయతీల్లోనే తాగునీటి సమస్య ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ సంఖ్య లెక్కకు మిక్కిలిగా ఉంటుంది. ఇక ఆయా గ్రామాల్లో ఏకంగా 700 చేతిపంపుల నుంచి నీళ్లు కూడా రావట్లేదనే విషయాన్ని గణాంకాలు వెల్లడిస్తుండడం గమనార్హం.

### ఆవాస గ్రామాలకు తాగునీరు అందని ద్రాక్షే..

ఇక జిల్లాలోని ఆవాస గ్రామాలకు కూడా తాగునీరు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. గుండాల మండలం బాటన్ననగర్, ఆళ్లపల్లి మండలం అడవిరామవరం, టేకులపల్లి మండలం మంగల్ తండా, సుజాతనగర్ మండలం బాలాజీనగర్ సహా ములకలపల్లి మండలంలోని మరో రెండు గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాలు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం నీటి సరఫరా దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దుమ్ముగూడెం మండలంలోని 15 గ్రామాల్లో రెండుమూడు బిందెలకు మించి నీటిని ఇవ్వడం లేదు.

### కుటుంబానికి రెండు బిందెలే..



ట్యాంకుకు నీళ్లు సరిగ్గా ఎక్కడం లేదు. దీంతో కొన్నిసార్లు ఒక్కొక్కరికీ రెండు బిందెలు, లేదంటే ఒక్కో కుటుంబానికి రెండు బిందెల చొప్పున భగీరథ నీళ్లు ఇస్తున్నారు. ఆ నీళ్లు ఇంట్లో అందరికీ సరిపోవడం లేదు. దీంతో మా ఊరిలో ట్యాంకు ఉన్నప్పటికీ ఉపయోగపడట్లేదు. ఈ మండలంలో గోదావరి ఉన్నా మాకు గోదారి నీరు రావడం లేదు.

–తునికి రాంబాబు, పెదకమలాపురం, దుమ్ముగూడెం మండలం

### చేతి పంపుల నీళ్లు తెచ్చుకుంటున్నాం..



మా ఇంట్లో నల్లా వేశారు. కానీ.. ఆ నల్లాకు ఇంత వరకూ నీళ్లు సరఫరా చేయట్లేదు. మా ఊరిలో అందరమూ కూలి పనులకు వెళ్లే వాళ్లమే. గ్రామంలో ఉన్న చేతి పంపుల నుంచే తాగునీళ్లు తెచ్చుకుంటున్నాం. ఎండాకాలం వస్తే ఆ చేతిపంపుల్లో కూడా నీళ్లు తక్కువగా వస్తాయి. మా ఊరిలో భగీరథ ట్యాంకు కట్టినప్పటికీ నీళ్లు మాత్రం ఇవ్వడం లేదు.

–కోటమ్మ, ఎర్రబోరు, దుమ్ముగూడెం మండలం

### కొన్ని గ్రామాల్లో సమస్య ఉంది..



భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీల్లోని 21 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. అది కూడా ఆవాస గ్రామాల్లోనే. ఎర్రబోరు గ్రామంలోని ట్యాంకుకు నీరు ఎక్కడం లేదంటే అది మా సమస్య కాదు. గ్రిడ్ వాళ్లు చేయాల్సిన పని. మేం అన్ని గ్రామాలకూ పైపులైన్లు వేశాం. కొన్నిచోట్ల నీరు రావడం లేదంటే అది స్థానిక సమస్య. పంచాయతీ వాళ్లు సరిచేస్తారు.

–తిరుమలేశ్, ఈఈ, మిషన్ భగీరథ, భద్రాద్రి

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- భద్రాద్రి జిల్లాలో 2,022 మంది ఓటర్లు
- 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- రామచంద్రా డిగ్రీ కాలేజీ నుంచి పోలింగ్ మెటీరియల్ తరలింపు


ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ పూర్తి చేశారు. పీవో, ఏపీవో, ఓపీఓలతో సమావేశం నిర్వహించి పోలింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 2,022 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా.. అందులో మహిళలు 954, పురుషులు 1,068 మంది ఉన్నారు. ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ఎన్నికల నియమావళి పాటించేలా చర్యలు చేపట్టారు. బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు, ప్రచారం, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడంపై ఎన్నికల సంఘం నిషేధించింది. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఆయా జిల్లాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

### 27న ఉదయం 8 గంటలకే పోలింగ్ షురూ..

27న జరిగే ఎమ్మెల్సీ పోలింగ్‌కు జిల్లాలోని 23 మండలాల్లో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీవోలు 28 మంది, ఏపీవోలు 28, వోపీలు 28, ఓపీఓలు 28 మందిని నియమించారు. 26న జిల్లా కేంద్రంలోని రామచంద్రా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు. అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని, సిబ్బందిని వాహనాల ద్వారా తరలిస్తారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనున్నది.

### నిబంధనలు పాటించాల్సిందే: భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి. ఈ నెల 25 నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు రాజకీయ ప్రచారాలు నిషేధించాం. బల్క్ ఎస్ఎంఎస్‌లు కూడా పెట్టకూడదు. సమావేశాలు, సభలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయి. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నాం. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

# సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 24 : సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వివిధ సమస్యలపై గిరిజనులు సమర్పించిన వినతుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి, మిగిలిన వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, ట్రైకార్ సబ్సిడీ రుణాలు తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆన్‌లైన్ చేసి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, గురుకులం ఆర్‌సీవో నాగార్జునరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఏవో సున్నం రాంబాబు, అగ్రికల్చర్ ఎస్‌వో భాస్కరన్, ఏపీవో పవర్ వేణు, ఆర్వోఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# వారబందీ లేకుండా సాగునీరు ఇవ్వాలని రైతుల ధర్నా

ఎండిపోతున్న పంటలకు నీరు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్


బోనకల్ వద్ద వైరా–జగ్గయ్యపేట రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

బోనకల్లు, ఫిబ్రవరి 24 : వారబందీ విధానం లేకుండా చివరి ఆయకట్టు భూములకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు బోనకల్లు మండలంలోని వైరా–జగ్గయ్యపేట రోడ్డుపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సాగర్ నీటిని బీబీసీ(బోనకల్ బ్రాంచ్ కెనాల్) నుంచి నారాయణపురం మైనర్ ద్వారా సరఫరా చేస్తుండగా.. ఆ నీటి ఆధారంగా సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకుడు చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ వారబందీ విధానం వల్ల చివరి ఆయకట్టులో సాగు చేసిన మొక్కజొన్న పంటలకు నీరందడం లేదన్నారు. ఎన్నెస్పీ అధికారులు వారబందీ విధానం ఎత్తివేసి, చివరి భూముల వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న జేఈ రాజేశ్ అక్కడికి చేరుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్, కూచిపూడి మురళి, కోట నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గుగులోతు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ పరీక్షల కోసం.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది ఉండాలి
- పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలి
- మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి టెన్త్ పరీక్షల నిర్వహణ
- ఇంటర్‌కు 72, పదో తరగతికి 97 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- అధికారుల సమీక్షలో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, ఫిబ్రవరి 24: రాబోయే టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లుచేయాలని ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని సూచించారు. టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 72, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 97 చొప్పున పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. టెన్త్ పరీక్షలకు సంబంధించి మార్చి 6న ఒక సెట్,10న రెండో సెట్ ప్రశ్నపత్రాలు జిల్లాకు వస్తాయన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు రవిబాబు, సోమశేఖరశర్మ, ఆశాలత, సురేందర్, డాక్టర్ కళావతీబాయి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాకలితో అలమటించిన విద్యార్థినులు

- మెనూ పాటించని భద్రాచలం బీసీ వసతిగృహం నిర్వాహకులు
- వంటమనుషులు రాలేదని సాకులు, ముద్దలుగా ఉన్న అన్నం
- ప్రిన్సిపాల్, వార్డెన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన పీడీఎస్‌యూ నాయకులు


ఆలస్యంగా భోజనం వడ్డించడం పట్ల వార్డెన్, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి శివ


ముద్దలుగా ఉన్న అన్నం

భద్రాచలం, ఫిబ్రవరి 24 : మెనూ కచ్చితంగా పాటిస్తున్నామని, నాణ్యమైన భోజనం పెడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఊదరగొడుతున్నా వేళకు అందని పరిస్థితి నెలకొన్నది. మధ్యాహ్నం దాటిపోయినా భోజనం వడ్డించకపోవడంతో విద్యార్థినులు ఆకలితో అలమటించారు. విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు వసతి గృహానికి వెళ్లి ప్రిన్సిపాల్, వార్డెన్‌ను నిలదీశారు. ఈ ఘటన భద్రాచలం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం చోటు చేసుకుంది. బీసీ బాలికల వసతి గృహంలో మధ్యాహ్నం దాటిపోయినా విద్యార్థినులకు భోజనం వడ్డించకపోవడంతో విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి శివ వసతి గృహానికి వెళ్లారు. భోజనం సరిగా ఉడకలేదనే ఉద్దేశంతో ఆకలితో ఉన్న విద్యార్థినులను గంటలతరబడి ఎండలో నిరీక్షించేలా చేయడంతో ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ప్రశ్నించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థినులు ఆకలితో ఇబ్బంది పడుతుంటే వేళకు వడ్డించకుండా వంటలు ఆలస్యమయ్యాయని సాకులు చెబుతారా అని మండిపడ్డారు. దీంతో రోజూ సమయానికే వడ్డిస్తున్నామని, ఈరోజు వంట సిబ్బంది రాకపోవడంతో ఆలస్యమైందని పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న మీడియాను వసతి గృహం లోపలికి అనుమతించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కాగా.. విద్యార్థినులకు భోజనం వడ్డించే విషయంలో ప్రిన్సిపాల్, వార్డెన్, వంట మనుషుల మధ్య గొడవలు తలెత్తుతున్నాయని, వారి గొడవల కారణంగానే పిల్లలు ఇలా అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ముద్దలుగా ఉన్న అన్నం విద్యార్థినులు ఎలా తింటారని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి శివ ప్రశ్నించారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్ కలుగజేసుకుని పరీక్షల సమయం కావడంతో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

# ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన 'ఎర్ర బంగారం'

**సుమారు 1.05 లక్షల బస్తాలను తీసుకొచ్చిన రైతులు**

రఘునాథపాలెం, ఫిబ్రవరి 24: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎర్ర బంగారం పోటెత్తింది. ఖమ్మం జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల రైతులు సోమవారం ఏకంగా సుమారు 1.05 లక్షల బస్తాలను తీసుకొచ్చారు. దీంతో మార్కెట్‌లోని యార్డులన్నీ నిండిపోవడంతో గేట్ల ముందే మిర్చి బస్తాలను దింపారు. సోమవారం మిర్చి ధర జెండా పాటలో రూ.14,125 పలికింది. కానీ వ్యాపారులు మాత్రం జెండా పాటను ఖాతరు చేయడం లేదు. జెండా పాటకు కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ క్వింటాకు రూ.500 నుంచి రూ.1000 తగ్గించి కొనుగోళ్లు జరిపారు. వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నా అధికారులు మాత్రం అటుగా కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించి రైతులు మోసపోతున్నారు.

